# వెన్నెల కురిసిన రాత్రి

**అడల్ట్స్ ఓన్లీ!**

జనవరి నెల.

ధాత్రిని రాత్రి కమ్ముకుంది. మంచు కురుస్తోన్న అనుభూతి. పెరట్లో జామ చెట్టు కింద నవారు మంచం మీద కూచుని ఆకాశం వంక చూస్తున్నాడు సౌజన్య మూర్తి. అరవయ్యేళ్ళ వయసులోనూ దృఢంగానే ఉన్నాడు. బట్టతల కూడా హుందాగా ఉందాయనకు. చలి పులి గాండ్రిస్తోన్నా బెదరడంలేదు.

రాత్రి పది దాటింది.

కొడుకులు, కోడళ్ళు, మనవలు టీవీ ముందున్నారు. ఏ అర్ధరాత్రో తప్ప టీవీ కట్టేయరు.

కిచెన్‌లో భార్య ప్రమద్వర వంట పాత్రలు సర్దుతోంది. మధ్య మధ్య భర్త కోసం చూస్తోంది. యాభై యేళ్ళ వయసులో కూడా చెక్కు చెదరని అందం, హుందాతనం ప్రమద్వరలో కనిపిస్తున్నాయి.

పనులన్నీ పూర్తయ్యాక టీవీ వున్న హాల్లోకి వెళ్ళ లేదు ప్రమద్వర. పెరట్లోకి వెళ్ళింది. ఒంటరిగావున్న భర్తనుచూసి ఆమె మనసు చివుక్కుమంది.

మనవలుకానీ, కొడుకులుగానీ తండ్రిని పట్టించుకోరు. అంటే బాధ్యతాపరంగా తిండి పెట్టడం, బట్టలు తీసుకురావడం కాదు. ఆయన అభిరుచులు గమనించడం, ఆయనతో కాసేపయినా టైము స్పెండ్ చేయడం.

''ఏవండీ!''

ఉలిక్కిపడి భార్య వంక చూసి చిరునవ్వుతో ''రావోయ్. కిచెన్ సామ్రాజ్యంలో పని పూర్తయిందా?'' అడిగాడు.

''మీకంతా వేళాకోళమే. అయినా వెంట్రుకలు తెల్లబడ్డాయి. వయసు పైబడుతోంది. ఇంకా 'రావోయ్' అంటూ పెళ్ళయిన కొత్తలో పిలిచినట్లు పిలుస్తారేమిటి. నాకయితే పిల్లలముందు తల తీసేసినట్లు వుంటోంది. వాళ్ళు కూడా 'ఏవోయ్ నాన్నమ్మా' అంటున్నారు'' అంది భర్తను ముద్దుగా విసుక్కుంటూ అతని పక్కనే కూచుని.

రోజూ వాళ్ళ కాలక్షేపం ఇదే.

రాత్రి కాగానే పనులన్నీ పూర్తి చేసుకుని ఆరు బయట కూచుని కాలాన్ని వెనక్కి తీసుకెళ్ళి గతాన్ని స్మృతిపథంలోకి తెచ్చుకుంటారు.

''ప్రమద్వరా! జీవితంలో ఎన్నో వెన్నెల రాత్రులను మిస్సయ్యాం. మరెన్నో కౌగిలి రాత్రులను కోల్పోయాం'' అతనిలో భావుకుడు బయటకు వచ్చాడు.

''అబ్బా ఊర్కోండి. ఇప్పుడీ కబుర్లు ఎందుకు?'' ఆవిడకూ పాత జ్ఞాపకాలు మధురంగానే ఉన్నా పైకి అలా అంటుంది.

''నిజం ప్రమద్వరా. ఆర్థిక అవసరాలు, కుటుంబ బాధ్యత, పిల్లలు.. .ఇవన్నీ మన కోరికలను నిర్దాక్షిణ్యంగా అణచివేశాయి. ఎందుకో ప్రమద్వరా నాకు...నాకు ఏడు పు వస్తోంది.''

భర్త గొంతులో మార్దవానికి చలించిపోయింది ప్రమద్వర.


''అదేమిటండీ!''

''అవును ప్రమద్వరా. నా గుండెలో గూడు కట్టుకున్న కోరిక, ఇన్నాళ్లు ఎవరికీ, చివరికి నీక్కూడా చెప్పని కోరిక. నీకు గుర్తుందా? ఈవాళ్టికి మన పెళ్ళయి ముప్పయారేళ్ళు. ఈరోజు మన పెళ్ళిరోజు.''

అప్పుడు గుర్తొచ్చింది ప్రమద్వరకి. జనవరి ఆరు. పెద్దల్ని ఎదిరించి ముహూర్తాలు బాగా లేవన్నా ఎవర్నీ లెక్క చేయక తామిద్దరం ఏకమైన రోజు.

''అయ్యో పాపిష్టిదాన్ని. ఆ విషయమే మర్చిపోయానండీ. మీరైనా ఉదయం గుర్తు చేయాల్సింది'' అంది నొచ్చుకుంటూ.

''గుర్తు చేస్తే సేమ్యా చేస్తావు. కొత్త బట్టలు కట్టుకుంటాం



అంతేగా. పెళ్ళి రోజంటే కొత్త బట్టలు, స్వీట్, ఫంక్ష న్... ఇవన్నీ కావు. మనస్ఫూర్తిగా తనువూ, మనసూ మమేకమై ప్రపంచాన్ని మరిచేలా మనిద్దరం ఏకాంతంలో గడపడం. బాధ్యతలు, బరువులూ వదిలి మన ప్రపంచంలో జీవించడం.''

భర్త మాటలు వినడానికి బావున్నా ఈ వయసులో ఏమిటని ఆమె మనసులో బిడియమో, సిగ్గో!

ఆమె మనసు మూడున్నర దశాబ్దాలు వెనక్కి వెళ్లింది.

★ ★ ★

పట్టెమంచం లేదు, మల్లెచెండ్లు లేవు. పాలగ్లాసు లేదు, తీపి పదార్థాలు లేవు. ఉన్నదొక్కటే గది. ఆ గదిలో ఓ సాదా సీదా చాప, ఆ చాపమీద ఓ దుప్పటి, రెండు దిండ్లు.

ఓ చిన్న కంపెనీలో ఉద్యోగం చేస్తున్న సౌజన్యమూర్తి ఏరికోరి అందర్నీ ఎదిరించి ప్రమద్వరను పెళ్ళి చేసుకుని ఆ చిన్నింటికి కాపురానికి తీసుకువచ్చాడు.

ఓవైపు దోమల సంగీతం, మరోవైపు చలి బెదిరింపు.

సాదాసీదా కాటన్ చీరలోనే అయినా అందంగా ఉంది ప్రమద్వర. నవ్వితే సొట్టలు పడే బుగ్గలు, తళుక్కుమని మెరిసే పలువరుస ఆమెలో ప్రతీ అణువూ అతనికిష్టమే.

''ప్రమద్వరా! బాధపడుతున్నావా? నా హృదయంలోకి నిన్ను ఆహ్వానించాను. ఆ హృదయంలో కూడా పేదరికమే ఉంది. తెల్లారితే మళ్లీ మన పోరాటం ప్రారంభమవుతుంది. ఈ చిన్న ఇంట్లో పెద్ద సమస్యలతో...''

అతని నోటిని మూసింది తన పెదవులతో. అలాగే ఆమె నడుం చుట్టూ చేయి వేసాడు. వెన్నని చిలికించి సృష్టించినట్టు మెత్తగా, మత్తుగా వుంది ఆమె నడుము.

## సూరేపల్లి విజయ

రెండు చేతులూ తల కింద దిండుగా పెట్టి పడుకుంది ప్రమద్వర. ఆ భంగిమలో అందంగా వుంది. పెదవులతో ఆమె పొట్టమీద చిన్నగా శబ్దం చేయకుండా ముద్దు పెట్టుకున్నాడు. ఆమె కదిలింది. వారించలేదు. ఈ శరీరం, ఈ మనసూ అతనికే. భార్యాభర్తల మధ్య బిడియాలు నిషిద్ధం అనే అభిప్రాయానికి ఆమె కట్టుబడి వుంది.

దోమల బాధ భరిస్తూనే తమ ఉద్యోగానికి ఊపిరి పోసుకున్నారు. క్షణాలు, నిముషాలు కరిగి కదిలి అక్కడ నుంచి వెళ్ళిపోయాయి.

ఆమె నుంచి విడివడి అతను ఆమె ఒళ్ళో తల పెట్టుకున్నాడు. ఏదో అసంతృప్తి. కోడి కూసినా వాళ్లల్లో మత్తు వదల్లేదు.

★ ★ ★

## A జోక్స్

### దొరికిపోయాను

''ఈమధ్యన మా ఫ్రెండొకడు రోజూ లాడ్జికి పోతున్నట్టు అనుమానం వచ్చి ఓరోజు వాడు చూడకుండా ఫాలో అవుతూ లాడ్జికి వెళ్లాను. ఇంతలో రైడింగు జరిగింది'' చెప్పాడు కుతూహల్రావు తన కొలీగ్‌తో.

''దొరికిపోయాడా మీ ఫ్రెండు?''

''లేదు! రైడింగులో నేను దొరికిపోయాను''

★★★

### నేను గీసింది

''జానపద రీతిలో 'అర్థనగ్నసుందరి'పై జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీల్లో నువ్వు ఫస్టు ప్రైజు కొట్టేసినా కూడా మీ డ్రాయింగు టీచర్ నిన్ను చితగ్గొట్టారంటున్నావేంటి?'' అడిగాడు ఆనంద్ తన మిత్రుడు ఉత్తేజ్‌ని.

''నేను గీసింది డ్రాయింగ్ టీచరుగారి అమ్మాయి బొమ్మ మరి!''

-తమ్మిశెట్టి భుజంగరావు(పాలకొల్లు)

★★★

# శృంగారానికి మనసు కూడా ప్రధానం

నవరసాల్లో శృంగారం రసరాజం అన్నారు కవులు. కవుల సంగతేమోగానీ నిత్య జీవితంలో శృంగారం మీద ఆసక్తి కోల్పోతే జీవితమే నిస్సారమైపోతుంది. ఈ మాట ఏ దేశ ప్రజలకైనా వర్తిస్తుంది.

భార్యాభర్తల మధ్య 'నీ, నా' తేడాలుండ కూడదు. పాలు, పంచదారలాగా కలసి పోగలిగితేనే అది ఆదర్శ దాంపత్యం. అయితే సత్సంప్రదాయంతో సత్సంబంధాలు కలిగి వుండిన చరిత్రలోని భారతీయులకు, నేటి విజ్ఞానవంతులైన భారతీయులకు మధ్యన ఎన్నో సమస్యల సుడిగుండాలున్నాయి. ఇది వాస్తవం. ముఖ్యంగా లైంగికంగా నేటి భారతీయులు ఎన్నో ఆటుపోట్లకు గురవుతున్నారు. ఒకే ఇంట్లో వుంటున్నా ప్రేమ, ఆప్యాయతలు మునుపటిలా విరివిగా కనిపించడంలేదు. అంతా యాంత్రిక జీవనం అయిపోయింది. దీనికి మేధావులు అనేక కారణాలు చెబుతున్నారు.

ఇది పోటీ ప్రపంచం. సమాజంలో హోదా లేకపోతే పనులు కావు. పనులు కావాలంటే హోదా కావాలి. హోదా కావాలంటే డబ్బు కావాలి. అప్పుడే ఈ సమాజం జేజేలు పలుకుతుంది. మరి డబ్బు సంపాదించడం చిన్న పని కాదు. అందుకు ఎన్నో త్యాగాలు చేయాలి. అహోరాత్రులు శ్రమించాలి. ఇంట్లో ముచ్చట్లాడుకుంటూ కూర్చుంటే విలువైన సమయం వృథా అయిపోతుంది. ఇదీ మన జ్ఞాన సంపన్నుల ఆలోచన. దీనికి ఇప్పుడు ఆడా మగా తేడాలేదు. ఇద్దరూ సంపాదనపరులే. అందుకే బెడ్‌రూమ్‌లో సైతం అవే ఆలోచనలు. మనసు ఎక్కడో వుంటే శృంగారం సాధ్యపడదని అనుభవజ్ఞులకు తెలిసిందే. శృంగారానికి మనసే ప్రధానం. అటువంటి మనసును డబ్బు మీదే లగ్నంచేసి జీవితాన్ని నిస్సారం చేసుకుంటున్నారు.



సెక్సుని విచ్చలవిడిగా అనుభవించేది ఎవరు? ల్యాటిన్ అమెరికా దేశాల్లో విచ్చలవిడి శృంగారం వుంటుందని ప్రపంచం అంతా అనుకునేది. వారిని అభివృద్ధి చెందుతున్న దేశాలు సైతం అనుసరించడం నేడు విడ్డూరమేమీ కాదు. అయితే ఇక్కడే ఒక విషయం గురించి సీరియస్‌గా ఆలోచించాల్సిన అవసరం వుంది. ఈమధ్య అమెరికన్ల శృంగార జీవితం మీద ఒక సర్వే జరిపారు. ఆ సర్వేలో తేలిన నిజాలను చూసి ప్రపంచం ముక్కున వేలేసుకుంది.

అసలు అమెరికన్లకు సెక్స్ గురించిన శాస్త్రీయ అవగాహన వుందా? లేదా? తెలుసుకోవడానికి కిన్సే ఇన్‌స్టిట్యూట్ 1988లో ఒక సర్వే నిర్వహించింది. 2174 మంది ఈ సర్వేలో పాల్గొన్నారు.

రోపర్ ఆర్గనైజేషన్ వీరిని ఇంటర్వ్యూచేసి చాలామంది అమెరికన్లకు మౌలికమైన శాస్త్రీయ విజ్ఞానం లేదని కనుగొన్నారు. న్యూస్‌పేపర్లు, మేగజైన్లు ఎన్ని వున్నా సరైన సమాచారం అందట్లేదు. కనుక ఈ అవగాహన పెంచేందుకు డాక్టర్లు, మేధావులు ఇంకా ఎక్కువ కృషి చేయాలని అమెరికన్ సెక్సాలజిస్టులు భావిస్తున్నారు.

ఇప్పుడు ప్రపంచమంతా నపుంసకత్వ ఫోబియాతో వయాగ్రాను ఆశ్రయిస్తున్నారు. వయాగ్రాకు ఇంత విపరీతమైన డిమాండు ఎందుకు పెరిగిందోనని మానసిక శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. అందులో ఇటీవల అమెరికాలో ఒక సర్వే నిర్వహించారు. అమెరికా జనాభాలో 40 శాతం పైగా మహిళలు, 30 శాతం పురుషులు సెక్స్‌పట్ల అయిష్టంగా వుంటున్నారని, భావప్రాప్తి పొందలేకపోతున్నారని, ఇతరత్రా సెక్స్ సమస్యలతో బాధపడుతున్నారనీ ఆ సర్వే వెల్లడించింది. 1948 తర్వాత అమెరికన్ల శృంగార జీవితంపై సమగ్ర అధ్యయనాన్ని నిర్వహించడం ఇదే ప్రథమం. అధ్యయన వివరాలు తమకే ఆశ్చర్యం కలిగించాయని చికాగో విశ్వవిద్యాలయం సోషియాలజిస్టు ఎడ్వర్డ్ లామానే అన్నారు.

ఇన్ని అధ్యయనాలు ప్రజలకు ఎలా ఉపయోగపడుతున్నాయి. ఇన్ని పత్రికల్లో సెక్స్ ఎడ్యుకేషన్ మీద ఎన్నిరకాల కాలమ్స్ వస్తున్నాయి. వాటిని ఎంతమంది చదివి అర్థం చేసుకుంటున్నారోనని ప్రముఖ సెక్సాలజిస్టులను కదిపితే వారు వెల్లడించే అభిప్రాయాలు నిస్పృహలకు గురి చేస్తున్నాయి.

మంచి శృంగారానికి మూలం మంచి ఆరోగ్యమేనని వాత్సాయనుడు ఎప్పుడో సెలవిచ్చారు. మంచి ఆహారపు అలవాట్లు పాటిస్తున్న వారిలో శృంగార వాంఛ తగ్గడమనేదే ఉండదని ఘంటాపథంగా చెబుతున్నారు. అయితే దుర్వ్యసనాలు లేకపోవడమేననేది వారి ప్రధానోద్దేశ్యం కూడా.

-వాకాటి పృథ్వీప్రసాద్

''ఏంటి...ఏదో అసంతృప్తి...నాతో చెప్పరూ?'' అడిగింది తన ఒళ్లో పడుకుని తన చుట్టూ చేతులు వేసిన భర్తని ప్రమద్వర.

''భార్యాభర్తల మధ్య కలయిక ఎంత మధురంగా ఉండాలి?''

''అంటే...నేను ...నేనేమైనా లోపం చేశానా?'' ప్రమద్వర కంఠంలో సన్నటి వణుకు.

''ఛ...ఛ...ఆ లోపం నాలోనే వుంది. టెన్షన్. తెల్లవారితే ఇంటి అద్దె, పాలబాకీ, ఆర్థిక సమస్యలు. అలా కాకుండా నీతో కనీసం ఒక్క రోజైనా ఏ సమస్యలూ లేకుండా నాలో కలిసి కరిగిపోవాలి. ఆ రోజు ఎప్పుడు వస్తుందో?''

భర్త బాధ అర్థమైంది.

ఆర్థికపరమైన బాధలు, ఒత్తిళ్ళు, సమస్యలు, మనిషిలో ఉద్వేగాన్ని అణచివేస్తాయి.

''మనకూ మంచి రోజులొస్తాయి. మనస్ఫూర్తిగా అనుభవించే రోజు వస్తుంది'' ధైర్యం చెప్పింది భర్తకు.

కానీ ఆ రోజెప్పుడొస్తుందో మాత్రం ఆమెకూ తెలియదు.

★ ★ ★

అయితే వాళ్ళ కోరిక మాత్రం కోరికలానే ఉండిపోయింది. సౌజన్యమూర్తికి ఓ మంచి ఉద్యోగం దొరికింది. ఉద్యోగం దొరికి ఆర్థిక బాధలు ఇంక లేవు అనుకునే సమయానికి పెద్దబ్బాయి పుట్టుకొచ్చాడు. వాడి పెంపకం, స్కూల్లో చేర్పించడం...ఇలా మొదలవుతుండగానే చిన్నబ్బాయి...వాడిని పెంచడం...మళ్లీ యధావిధే.

పిల్లల పెంపకం , వాళ్ళను చదివించడం, బాధ్యతలు, బరువులూ, మళ్లీ సంపాదనలో పడి, పోటీపడి కాలాన్ని ఖర్చు చేయక తప్పలేదు.

అలా కాలం పరుగెడుతూ పిల్లల్ని పెద్దవాళ్ళని చేసింది. వాళ్ళ ప్రయోజకత్వానికి ఓ సార్థకత కలిగించింది. ఉద్యోగాలు దొరికాయి. సౌజన్యమూర్తి ఓ బ్రాంచీకి సూపర్నెంట్‌గా పని చేస్తూ రిటైరయ్యాడు.

స్వంత ఇల్లు వుంది. పిల్లలకు ఉద్యోగాలు వచ్చాయి. పెళ్ళిళ్ళు అయ్యాయి. మనవలు పుట్టుకొచ్చారు.

రోజులు గడుస్తూ, నెలలను తీసుకువెళుతూ సంవత్సరాలను దాటిస్తూ కాలం నిర్దయగా సాగుతూనే వుంది.

ఏకాంతం కోసం తమ ఆరాటాన్ని మాత్రం తీర్చకుండా సాగిపోతున్న కాలాన్ని చూసి నిట్టూర్చాడు సౌజన్యమూర్తి.

★ ★ ★

''కాలం ఎంత త్వరగా గడిచిపోయిందండీ'' అంది గత స్మృతుల నుంచి బయటకు వచ్చిన ప్రమద్వర.

''అదే నా బాధ. కాలం మన కోసం ఆగదుగా. కానీ మన కోరిక మాత్రం అలాగే వుండిపోయింది.''

''ఈ వయసులో మీ కోరిక విడ్డూరంగా వుంటుంది కదండీ?''

''నిజం చెప్పు ప్రమద్వరా! నీకూ విడ్డూరంగా అనిపిస్తుందా? సెక్స్ అంటే ఒకే వయసుకు పరిమితమైందా? కేవలం పిల్లలను కనడం మన మధ్య వుండే కలయికకు అర్థం కాదు. అది ఓ భాగం. పిల్లలు పుట్టగానే మనం మంచాలు వేరుగా వేసుకోవడం, మనవలు పుట్టుకు రాగానే మనవల పక్కన మంచమ్మీద నేను, మనవరాళ్ళతో నేలమీద నువ్వు పడుకోవడం...ఎందుకు ప్రమద్వరా...వద్దు ఈ జీవితం నాకు బోర్ కొడుతోంది. కొడుకులు అనుకుంటారనీ, కోడళ్ళు ముక్కు మీద వేలేసుకుంటారనీ నువ్వు నేను దూరంగా వుంటూ మానసికంగా కూడా ఒంటరితనం అనుభవించడం ఎందుకు? ఇది ఈనాటి బాధ కాదు. పెళ్ళయిన కొత్తలో ఆర్థిక సమస్యలు, ఆ తర్వాత పిల్లల సమస్యలు, ఆ తర్వాత వాళ్ళ పెళ్ళిళ్లు, పేరంటాలు. ఇప్పుడు వృద్ధాప్యంలో దూరం దూరంగా మన కోసం మనం ఎప్పుడు బ్రతుకుదాం?'' అతని కంఠంలో ఉద్రేకం కాదు. ఆవేదన తాలూకు ఉద్వేగం.

ప్రమద్వర ఆలోచనలో పడింది. నిజమే! కనీసం అతను తన ఒళ్లో తలపెట్టినా వద్దని వారించింది. ఈ ముదిమి వయసులో ఏముంది? తన ఆలోచనలు ఎందుకు మారిపోయాయి. తమ దాంపత్యాన్ని ఎందుకు దూరం చేసుకోవాలి?

భార్యాభర్తల మధ్య సంబంధం యవ్వనంలోనేనా? వాళ్ల మధ్య అనుబంధానికి కాల పరిమితి ఉండాలా? ఆమెలో అంతర్మథన ఆలోచనగా మారి ఓ నిర్ణయానికి నాంది పలికింది.

★ ★ ★

''ఒరేయ్ పెద్దోడా, చిన్నోడా! ఒక్కసారి నాన్న మీతో మాట్లాడతారుట'' చెప్పింది ప్రమద్వర.

కొడుకులు, కోడళ్ళు సమావేశమయ్యారు.

సౌజన్యమూర్తి సభాధ్యక్షతతో ఆ సభ ప్రారంభమయింది.

''ఏం లేదర్రా...మేడమీద ఓ గది వేయిద్దామనుకుంటున్నాను బ్యాంకులో నా పిఎఫ్ తాలూకు డబ్బుతో. ఆ గదిలో నేనూ మీ అమ్మ వుంటాం. కలిసే వుందాం. కానీ నాకంటూ ఓ గది కావాలి. ఆ గదిలో నేనూ, మీ అమ్మ చచ్చేవరకూ కాపురముండాలి!'' క్లుప్తంగా చెప్పాడు.

ఆ మాటలను ఎవరు ఎన్ని రకాలుగా అర్థం చేసుకున్నా ఆ దంపతులు వెనకడుగు వేయదల్చుకోలేదు.

రోజంతా పిల్లలతో, మనవలతో కాలక్షేపం చేసినా రాత్రి వేళ కనీసం రాత్రయినా ఆ దంపతులకు ఏకాంతం ఉండాలి. మానసికమైన ఓదార్పు కోసం. చివరి శ్వాసవరకూ కలిసే వుండడం కోసం. ఆ అనుభూతిని పదిలపర్చుకోవడం కోసం.

యవ్వనంలో వుండే కబుర్లే కాదు వృద్ధాప్యంలోనూ వాళ్ళకు స్వీట్ నథింగ్స్ ఉండాలి. చెప్పుకోవాలి.

★ ★ ★

పిల్లలు ఆలోచనలో పడ్డారు. నిజమే రేపు తమకూ వృద్ధాప్యం వస్తే తాము కూడా ఇలానే వేరుగా ఉండాలి. ఇప్పుడు తండ్రి తీసుకున్న నిర్ణయంవల్ల తమకూ ధైర్యం వచ్చింది. మరణించేవరకూ భార్యాభర్తలు విడిగా, మానసికంగా, శారీరకంగా బ్రతకాల్సిన అగత్యం లేదు. కలిసే వుండాలి. మరణమే భార్యాభర్తలను భౌతికంగా వేరు చేయాలిగానీ వృద్ధాప్యం, పిల్లలూ, బాధ్యతలు కావు.

★ ★ ★

మేడమీద గదిలో వాళ్ళిద్దరూ.

ఉదయమంతా కొడుకులు, కోడళ్లతో కలసిపోయి, మనవలతో ఆడుకుంటూ ఉండిపోతారు. రాత్రి కాగానే తమదైన ప్రపంచంలో ఆ మేడమీద గదిలో ప్రమద్వర ఒడిలో సౌజన్యమూర్తి సేద తీరుతాడు. వృద్ధాప్యం వాళ్ళ కోరికలకు కళ్లెం వేయలేదు. వృద్ధాప్యం వాళ్ళ ఆలోచనలను అడ్డుకోలేదు.

వాళ్ళకు ప్రతి రాత్రి, ప్రతి పగలు, ప్రతి క్షణం వెన్నెల కురుస్తూనే వుంది. కురిసే ఆ వెన్నెట్లో వాళ్ల దాంపత్యం, వాళ్ళ అనుభూతులు తడిసి ముద్దయి ముద్దుగా, మురిపెంగా వాళ్ళ చుట్టూ పరిభ్రమిస్తూనే ఉన్నాయి.

★

## జీవిత భాగస్వామి ఎంపికలో తప్పుదోవ పట్టించే జీన్స్



కొన్ని జంటల్ని చూస్తే మనకు ఆశ్చర్యం కలగకపోదు. అమ్మాయి చాలా సున్నిత మనస్కురాలు, సంప్రదాయాలపై గౌరవం కలిగినది అయి వుంటే అబ్బాయి పూర్తి భిన్నంగా వుంటాడు. స్త్రీలను ఏమాత్రం గౌరవించక ప్రియురాలిని సైతం అనుక్షణం కించపరుస్తుంటాడు. మరి ఇలాంటి అబ్బాయిని ఆ అమ్మాయి ఎందుకు ప్రేమించింది అన్న అనుమానం రావచ్చు. ఇందుకు కారణం పూర్తిగా జీన్సేనని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. '19 క్రోమోజోమ్' మీద ఉండే "PRIC 1' జీన్ ప్రభావం వల్ల అమ్మాయిలు పూర్తిగా తమకు భిన్నంగా ఉండే మగవారిని ఎంచుకుంటారు. దాదాపు 378 స్త్రీలపై జరిపిన పరిశోధనల ఫలితంగా ఈ విషయం వెల్లడయింది. తమను ఎంత మాత్రం పట్టించుకోని వారిని, ప్రేమించే అవకాశం ఇతరులలో అంటే ఈ "PRIC 1' జీన్ లేని వారితో పోలిస్తే రెండు రెట్లు ఎక్కువ. వివాహితులైన పురుషుల ప్రేమలో పడి వారికి రెండో భార్యగా స్థిరపడే అవకాశం "PRIC 1' జీన్ ఉన్నవారిలో దాదాపు పదిహేను రెట్లు ఉంటే గొడవలు వచ్చి ప్రేమికుడిని వదిలే అవకాశం కూడా ఈ జీన్ ఉన్నవారిలో ఉంది. నిజంగా ఇది అద్భుత పరిశోధన అని ఓ సామాన్య రక్తపరీక్ష ద్వారా స్త్రీలో ఈ జీన్ ఉన్నదీ లేనిదీ నిర్ధారించవచ్చునీ వైద్య బృందాలు తెలియజేస్తున్నాయి.

–కామాక్షి